ఈనాడు యాదాద్రి భువనగిరి

శనివారం అక్టోబరు 26, 2024

ఎంఎస్ఎంఈ పార్కు అద్భుతం: నిర్మల జగ్గారెడ్డి



పార్కు సందర్శనలో పరిశ్రమ ఉత్పత్తుల వివరాలు తెలుసుకుంటున్న టీజీఐఐసీ ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి

చౌటుప్పల్‌గ్రామీణం, చౌటుప్పల్, న్యూస్‌టుడే: దండుమల్కాపురంలో ఏర్పాటు చేసిన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల(ఎంఎస్‌ఎంఈ) పార్కు అద్భుతంగా ఉందని తెలంగాణ మౌలిక సదుపాయాల సంస్థ(టీజీఐఐసీ) ఛైర్మన్ నిర్మల జగ్గారెడ్డి పేర్కొన్నారు. పార్కులో నూతనంగా నిర్మించిన ఎన్వీరో ఫ్లూయిడ్స్ పరిశ్రమను శుక్రవారం ఆమె ప్రారంభించారు. పార్కులోని పలు విభాగాల పరిశ్రమలను సందర్శించారు.

★ పారిశ్రామికవేత్తలు, ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్కులో మౌలిక సదుపాయాలు కార్పొరేట్ పరిశ్రమల్లో మాదిరిగా బాగున్నాయని కొనియాడారు. దేశానికే తలమానికంగా ఈ పార్కు నిలుస్తుందని అభిప్రాయపడ్డారు.

★ పార్కులో నీటి సరఫరా, 132 కేవీ సబ్‌స్టేషన్, ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్ వంటి అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. పారిశ్రామిక పార్కు నేపథ్యాన్ని, అభివృద్ధిని, పారిశ్రామిక ప్రాంత అవసరాలను తెలంగాణ పరిశ్రమల సమాఖ్య(టీఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి కొండవీటి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

★ టీఫ్ ప్రధాన కార్యదర్శి మిర్యాల గోపాల్‌రావు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్, ఎన్వీరో ఫ్లూయిడ్స్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్లు రవినాయక్, సుధాకర్‌నాయక్, టీఫ్ ప్రతినిధులు గోవిందారెడ్డి, స్వామిగౌడ్, యాదయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, కళా రమేశ్, తాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

వంటపాత్రలు వచ్చేస్తున్నాయ్..!

రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకం అమలవుతోంది. ఇందుకు స్థానికంగా మహిళా సంఘం సభ్యులను నియమించడమే కాకుండా వారికి గౌరవ భృతి సైతం అందిస్తోంది. అప్పట్లో దశల వారీగా వంటగదులను సైతం నిర్మించారు. అంతా బాగానే ఉన్నా పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం ప్రారంభమైనప్పుడు అందించిన వంటపాత్రలతోనే ఏజెన్సీలు ఇప్పటి వరకు వినియోగిస్తున్నారు. కాలం చెల్లిన పాత్రలతో వంటలు రుచికరంగా ఉండకపోవడంతో పాటు ఇబ్బందులు పడుతున్నామని వంట ఏజెన్సీ మహిళలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పెద్దగా ఫలితం లేకుండా పోయింది. వంట ఏజెన్సీల డిమాండ్ల నేపథ్యంలో ఈ విషయాలను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం తాజాగా వంటపాత్రల కొనుగోళ్లకు నిధులు మంజూరు చేసింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని ఆయా పాఠశాలల్లో పథకం నిర్వహణకు వంటపాత్రలకు ప్రభుత్వం రూ.2.60 కోట్లు వెచ్చించింది.



రాజపేటలోని ఓ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నభోజనం వడ్డిస్తున్న ఏజెన్సీ (పాతచిత్రం)

అందించనున్న పాత్రలు ఇవీ..

తెల్ల అన్నం వండే గిన్నెలు, ఇంగ్రీడియంట్స్ కోసం స్టీలు కంటైనర్లు, వండిన వాటిని వడ్డించేందుకు స్టీలు బకెట్లు, అన్నం వడ్డించే కబ్గీర్ (స్థానికంగా చెయ్యి అంటారు), కూరలు వడ్డించేందుకు గంటెలు తదితరాలను ప్రతి బడికి అందించనున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాత్రలను అందించేందుకు జిల్లా విద్యాశాఖకు నిధులు మంజూరు చేసింది. కొద్ది రోజుల్లోనే సరఫరాకు బహిరంగ టెండర్లు పిలువనున్నారు. జిల్లా స్థాయిలో వంటపాత్రల సరఫరాకు అన్ని రకాల అర్హతలున్న పంపిణీదారుల నుంచి టెండర్లు ఆహ్వానించి పాత్రల కొనుగోలు బాధ్యతలు అప్పగిస్తారు. తాజాగా ప్రభుత్వ పరంగా వంటపాత్రల కోసం నిధులు మంజూరు చేయడంతో వంట ఏజెన్సీలు, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా వివరాలు.. (రూ.లల్లో)

జిల్లా	నిధుల మంజూరు
నల్గొండ	1,18,10,000
సూర్యాపేట	77,90,000
యాదాద్రి	64,80,000

సన్నాలకు ససేమిరా..!

హుజూర్‌నగర్, హుజూర్‌నగర్ గ్రామీణం, కోదాడ, న్యూస్‌టుడే:

మరో వారం రోజుల్లో మార్కెట్‌లోకి ధాన్యం ఇబ్బడి ముబ్బడిగా రానుంది. మిల్లర్లు మాత్రం సన్నరకాల ధాన్యం మిల్లింగ్ చేసే విషయంపై పట్టు వీడలేదు. ప్రభుత్వం వారి డిమాండ్లపై ఇంకా కొలిక్కి రాలేదు. సబ్‌కమిటీ ఒక నిర్ణయం తీసుకుని సీఎంకు నివేదిక ఇచ్చినట్లు సమాచారం. క్యాబినెట్ సమావేశంలో దీనిపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని చెబుతున్నారు. ఒక్కసారిగా ధాన్యం మార్కెట్‌లోకి వస్తే సన్న రకాలను ఎక్కడికి పంపుతారన్న విషయంపై స్పష్టత లేదు. ధాన్యం నేరుగా మిల్లులకు కేటాయించకుండా కొనుగోలు కేంద్రాల నుంచి గోదాములకు తరలించాలని నిర్ణయం తీసుకున్నప్పటికీ ఖర్చులు పెరుగుతాయన్న దానిపై తర్జన భర్జన పడుతున్నారు. ఇతర భారాలు నెత్తికి ఎత్తుకోకుండా మిల్లర్లకే ఇవ్వాలన్న ఆలోచనకు వచ్చినట్లు సమాచారం.




హుజూర్‌నగర్ సమీపంలో కోతకు సిద్ధంగా సన్నరకం వరి

పెరగనున్న అవసరాలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,83,560 మెట్రిక్ టన్నుల సన్న రకాల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని అంచనా వేస్తున్నారు. దొడ్డు రకాల ధాన్యం 10,69,029 మెట్రిక్ టన్నులు వస్తుందని అంచనా. ప్రభుత్వం సన్న రకాల ధాన్యం తీసుకుని పౌరసరఫరాల అవసరాలకు వాడుకోవాలని చూస్తోంది. జనవరి నుంచి పేదలకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకు సన్న రకాల సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సన్నరకాల ధాన్యం పండించిన రైతుకు రూ.500 బోనస్ కూడా ప్రకటించింది. ఇప్పటి వరకు సన్న రకాల ధాన్యాన్ని మిల్లులకు పంపించాలా, గోదాములలో ఉంచాలా అనే నిర్ణయం కోసం ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక అంచనా (మెట్రిక్ టన్నుల్లో)



★ సన్నధాన్యం మిల్లింగ్ చేసినప్పుడు దొడ్డు రకాలకు వచ్చినట్లు 67 కిలోల బియ్యం రావని, 57 కిలోలు మాత్రమే వస్తాయని మిల్లర్లు అంటున్నారు. ప్రభుత్వం మాత్రం దొడ్డు రకమైనా, సన్న రకమైనా క్వింటాకు 67 కిలోల బియ్యం ఇవ్వాలంటుంది. తేమ శాతంతో సన్న రకాల ధాన్యం దిగుమతి చేసుకుంటే నెల రోజుల్లోపే రంగు మారిపోతుందని మిల్లర్లు చెబుతున్నారు. అందుకు తేమ శాతాన్ని 14 శాతానికి మార్చాలంటున్నారు. మిల్లింగ్ ఛార్జీలు, ధాన్యం నిల్వ చేసిన ఛార్జీలు పెంచాలని పట్టుబడుతున్నారు.

కొనుగోళ్లకు సర్వం సిద్ధం

ధాన్యాన్ని రెండు రకాలుగా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటు చేసింది. దొడ్డు రకాలు ఒక కేంద్రంలో, సన్న రకం మరో కేంద్రంలో కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. సన్నరకాలను గుర్తించేందుకు ప్రత్యేక సాంకేతిక పద్ధతులను అవలంబించనున్నారు.



ఉమ్మడి జిల్లాలో అక్టోబరు 2,22,711 నవంబరు 6,58,334 డిసెంబరు 5,17,814 జనవరిలో 1,21,363 మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఆందోళన

భువనగిరి, న్యూస్‌టుడే: మొదట జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ట్రిపుల్ ఆర్ నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేస్తూ భువనగిరి మండలంలోని ప్రాంతీయ వలయ రహదారి భూ నిర్వాసితులు భువనగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. భూ నిర్వాసితుల సంఘం నాయకులు తంగెళ్లపల్లి రవికుమార్, అవిశెట్టి పాండు ఆధ్వర్యంలో నిర్వాసిత రైతులు పాల్గొన్నారు. అవార్డు విచారణ సమావేశం బహిష్కరించారు. రాయగిరి, గౌస్‌నగర్, ఎర్రంబెల్లి, పెంచికలపహాడ్ గ్రామాలకు చెందిన రైతులు పాల్గొన్నారు. అలైన్‌మెంట్ మార్చాలని, అవార్డు విచారణ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాలకు చెందిన రైతు సంఘం నాయకులు అర్జున్‌రెడ్డి, సంజీవరెడ్డి, బల్గూరి చంద్రారెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, మద్దూరి అంజిరెడ్డి పాల్గొన్నారు.



భువనగిరి ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ట్రిపుల్ ఆర్ రైతులు



చౌటుప్పల్‌లో ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న భూనిర్వాసితులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రాంతీయ రింగు రోడ్డు కోసం తమ నుంచి సేకరిస్తున్న భూమికి ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించాలని, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ చౌటుప్పల్‌లో భూనిర్వాసితులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. భూసేకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ఆధార్, పాన్‌కార్డు పత్రాలు సేకరించేందుకు స్థానిక తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశాన్ని వారు బహిష్కరించారు. తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవో శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ హరికృష్ణలకు వినతిపత్రాలు అందజేశారు. జాతీయ రహదారిపై బైఠాయించారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు వారిని అడ్డు తొలగించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని భూనిర్వాసితులు కోరారు. భూనిర్వాసితుల ఐక్యవేదిక నాయకులు దామోదర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, దబ్బటి రాములు, జాల శ్రీశైలం, వెంకటేశ్, సందగల్ల మల్లేశం, బోరెం ప్రకాశ్‌రెడ్డి, చిన్నపిల్లలను ఎత్తుకుని మహిళలు తదితరులు పాల్గొన్నారు.

డీఏ బకాయిలు చెల్లించాలి



మందడి ఉపేందర్‌రెడ్డి

భువనగిరి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న డీఏ, ఇతర బిల్లులను వెంటనే విడుదల చేయాలని టీజీఈజేఏసీ నూతన ఛైర్మన్ మందడి ఉపేందర్‌రెడ్డి కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ (టీజీఈజేఏసీ) జిల్లా స్థాయి సమావేశం స్థానిక వివేరా హోటల్ శుక్రవారం జరిగింది. సమావేశంలో 45 సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం... సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా మందడి ఉపేందర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ ధరణికోట భగత్, అడిషినల్ సెక్రటరీ జనరల్ కుంట్ల అమరేందర్‌రెడ్డి, కోఛైర్మన్స్ ముక్కెర్ల యాదయ్య, జగన్, రామ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా ఎండీ ఖదీర్, శశికాంత్, శ్రీకాంత్, అజీజ్ అలీఖాన్, వైస్ ఛైర్మన్లుగా కల్లూరి రమేష్, లక్ష్మీనరసింహారెడ్డి, రవీందర్‌నాయక్, మోహన్‌రెడ్డి, రవికుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, సెక్రటరీలుగా అంబికా, జానీ, వెంకటరమణ, సురేష్, మహేష్, రమేష్‌బాబు, ఫైనాన్స్ సెక్రటరీ కుమార్, ఆఫీస్ సెక్రటరీలుగా లక్ష్మీ, బాలస్వామి, అనిల్, ప్రచార సెక్రటరీగా శైలజ, మహిళా ప్రతినిధి కవిత ఎన్నికయ్యారు.

మూసీ ప్రక్షాళనపై జన చైతన్యం

భువనగిరి, న్యూస్‌టుడే: మూసీ పునరుజ్జీవం కోసం ప్రభుత్వం చేపడుతున్న ప్రక్షాళన కార్యక్రమానికి ప్రజా మద్దతు కూడగట్టేందుకు జిల్లాలోని ప్రజా ప్రతినిధులు కార్యాచరణ చేపట్టారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజా చైతన్య యాత్ర నిర్వహణకు రంగం సిద్ధం చేశారు. భూదాన్ పోచంపల్లి మండలంలో పిల్లాయిపల్లిలో శనివారం ర్యాలీ చేపట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే ఏర్పాట్లు పూర్తి చేశారు. పరిసర గ్రామాల నుంచి కూడా జనసమీకరణ చేయనున్నారు.

☛ మూసీ నది హైదరాబాద్ నుంచి మురుగు నీటితో పాటు పరిశ్రమల ప్రమాదకర రసాయన వ్యర్థాలను మోసుకువస్తోంది. యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, నల్గొండ జిల్లాలపై కాలుష్య ప్రభావం తీవ్రంగా ఉంది. నది పరీవాహక ప్రాంతాల్లో మానవ మనుగడకు ముప్పు వాటిల్లింది. పంటలు సాగు ప్రశ్నార్థకంగా మారింది. జీవరాశుల ఉనికికే ప్రమాదకరంగా మారింది. గత ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి మూసీ రివర్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించినా కార్యరూపం దాల్చలేదు.

☛ హైదరాబాద్‌లో ఎఫ్‌టీపీలను ఏర్పాటు చేసినా అవి పనిచేయని పరిస్థితి. ఈ పరిస్థితుల్లో రేవంత్‌రెడ్డి సర్కార్ మూసీ ప్రక్షాళన చేపట్టేందుకు ముందుకు రావడంతో

నేటి నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రచారం

జిల్లా ప్రజల్లో కొత్త ఆశలు చిగురించాయి. కానీ హైదరాబాద్ జంట నగరాల్లోని మూసీ పరీవాహక ప్రజలు నిరాశ్రయులం అవుతున్నామని ఆందోళన వ్యక్తం చేయడం, ప్రతిపక్షాలు అడ్డుపడుతుండటంతో కాలుష్య ప్రభావిత ప్రాంతాల ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నాలను మొదలుపెట్టారు. మూసీ నది బీబీనగర్ మండలం మక్తా అనంతారంలో అడుగుపెట్టి వాడపల్లి వద్ద కృష్ణా నదిలో కలుస్తుంది. బీబీనగర్, భూదాన్ పోచంపల్లి, వలిగొండ, రామన్నపేట, కేతపల్లి, నకిరేకల్, శాలిగౌరారం తదితర మండలా మీదుగా ప్రవహిస్తోంది.

కార్యక్రమం ఇలా..

శనివారం ఉదయం 10 గంటలకు భూదాన్ పోచంపల్లి నుంచి ర్యాలీ ప్రారంభిస్తారు. మక్తాఅనంతారం వంతెన వరకు సాగుతుంది. కులవృత్తుల వారు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తారు. జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా హాజరు కానున్నారు.




జిల్లా మీదుగా ప్రవహిస్తున్న మూసీ నది

ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

మూసీ కాలుష్యాన్ని పారదోలేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన ఈ బృహత్ కార్యానికి పార్టీ రహితంగా ప్రజలు మద్దతు తెలిపారు. ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఉమ్మడి జిల్లాలోని పరీవాహక ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు రూపొందించాం. తొలివిడతగా పిల్లాయిపల్లి నుంచి ప్రజాచైతన్య యాత్రను నిర్వహిస్తున్నాం.

అతివలపై.. ఆగని అకృత్యాలు

భువనగిరి నేరవిభాగం, న్యూస్‌టుడే:



మహిళలు, బాలికలు, యువతులపై దాడులు జిల్లాలో ఎక్కడో ఒకచోట వెలుగుచూస్తూనే ఉన్నాయి. హత్యలు, వేధింపులు, అత్యాచార, అపహరణ ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మహిళలు, బాలికల భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పోలీసులు చెబుతున్నా.. నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యలతో నేరాల సంఖ్య మాత్రం తగ్గడం లేదు.

అయినవారే..

మద్యం మత్తులోనే నేరాలు జరుగుతున్నట్లు పోలీసుల విచారణలో తేలుతోంది. వేధింపులు, దాడులు, ఆత్మహత్యల కేసుల్లో సగానికిపైగా భార్యాభర్తలు, ఇతర కుటుంబసభ్యుల మధ్య ఏర్పడి గొడవల కారణంగానే జరుగుతున్నాయి. తాజాగా అడ్డగూడూరు మండలం డి.రేపాకలో కట్టుకున్నవాడే మద్యం మత్తులో భార్యను దారుణంగా హత్య చేశాడు. రక్త సంబంధీకుల మధ్య ఏర్పడిన ఆస్తి తగాదాలతో మరికొన్ని కేసులు నమోదవుతున్నాయి. వివాహేతర సంబంధాల నేపథ్యంలో హత్యలు, అత్యాచారాలు, ఆత్మహత్య కేసులు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. బంగారు ఆభరణాల కోసం మహిళలపై దాడులకు తెగబడుతున్నారు.

నిఘా పెంచాల్సిందే

☛ మహిళాలు, బాలికలపై జరిగే అకృత్యాలపై అప్రమత్తం చేసేందుకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి.

☛ ఆత్మహత్యలకు దారితీయకుండా మానసికస్థైర్యం పెంచేలా మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ సదస్సులు నిర్వహించాలి.

☛ కళాశాల, పాఠశాల స్థాయి నుంచే బాలికలకు, యువతులకు తమ స్వీయ రక్షణ కోసం కరాటే నేర్పించాలి.

కొన్ని ఘటనలు..

◆ భువనగిరి మండలంలో మానసిక దివ్యాంగురాలిపై లైంగిక దాడి జరిగింది. అదే గ్రామానికి చెందిన వ్యక్తి మద్యం మత్తులో ఘటనకు పాల్పడటంతో బాధిత యువతి సెప్టెంబరు 20న పోలీసులను ఆశ్రయించింది.

◆ విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయుడే బాలికలపై కన్నేశాడు. భువనగిరి పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో సైన్స్ బోధించే ఉపాధ్యాయుడు బాలికలతో అసభ్యంగా ప్రవర్తించి, అశ్లీల వీడియోలు, సందేశాలు పంపి వేధించాడు. ఘటన ఆరు నెలల క్రితం వెలుగుచూసింది.

☛ మద్యం, గంజాయి మత్తు వల్ల నేరాలు పెరుగుతున్నాయి వాటి కట్టడికి కట్టుదిట్టంగా చర్యలు తీసుకోవాలి.

నేరాల అదుపునకు ప్రత్యేక ప్రణాళిక

– ఎం.రాజేశ్‌చంద్ర, డీసీపీ యాదాద్రిభువనగిరి



మహిళలపై నేరాల అదుపునకు ప్రత్యేక ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నాం. ఫిర్యాదులు అందిన వెంటనే వేగంగా స్పందించి కేసుల నమోదు చేసి నిందితులను గుర్తించి అరెస్టు చేస్తున్నాం. ఎలాంటి ఇబ్బందులు ఉన్నా డయల్ 100 ద్వారా నిర్భయంగా ఫిర్యాదు చేయాలి. ఈవ్ టీజింగ్, అసభ్యంగా ప్రవర్తించేవారిని గుర్తించేందుకు మఫ్టీలో పోలీసు బృందాలు పనిచేస్తున్నాయి.

మూడేళ్లలో నేరాల తీరు ఇలా..


సంవత్సరం	హత్యలు	అత్యాచారాలు	హత్యాయత్నాలు	వేధింపులు	దాడులు	వేధింపులతో ఆత్మహత్యలు	పోక్సో
2022	03	38	10	202	03	04	45
2023	03	38	11	186	03	05	47
2024 సెప్టెంబరు	05	26	03	132	05	03	41



అద్దాల మండపంలో అమ్మవారి సేవోత్సవం

యాదాద్రిలో ఊంజల్ సేవోత్సవం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి పుణ్యక్షేత్రంలో శుక్రవారం నిత్య పూజలతో పాటు సంప్రదాయ కైంకర్యాలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలోని స్వయంభువులను మేల్కొలిపి హారతితో కొలిచారు. గోవుపాలతో నిజాభిషేకం నిర్వహించాక, తులసీదళాలతో అర్చన చేపట్టారు. అష్టభుజి మండప ప్రాకారంలో శ్రీసుదర్శన నారసింహహోమం, శ్రీలక్ష్మీనరసింహుల నిత్యకల్యాణం నిర్వహించారు. కల్యాణమూర్తులను గజ వాహనంపై అలంకృతులను చేసి, సేవా పర్వాన్ని చేపట్టారు. సాయంత్రం అమ్మవారిని ప్రత్యేక అలంకరణతో తీర్చిదిద్ది ఊంజల్ సేవా పర్వాన్ని నిర్వహించారు. అమ్మవారి సేవను మాడవీధుల్లో మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. కుంకుమార్చన జరిపారు. నిత్యార్జిత పూజల్లో భాగంగా శ్రీస్వామి, అమ్మవార్ల అలంకార సేవలను మాడవీధుల్లో ఊరేగించారు. రాత్రి స్వయంభువులను ఆరాధిస్తూ ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన జరిపారు.



మూడేళ్లుగా స్నానాల గదే ఆవాసం

కడు పేదరికంలోనూ వారసత్వంగా వచ్చిన పూరింట్లోనే దర్జీగా జీవనం సాగిస్తూ ఇద్దరు మగ పిల్లల్ని పెంచి పెద్ద చేశారు ఆయన. కుమారులు లారీ డ్రైవర్‌గా ఒకరు, పొలం పనులు చేసుకుంటూ మరొకరు చెరో దారి చూసుకుని వేరే గ్రామాల్లో స్థిరపడ్డారు. జీవితాంతం తోడుండాల్సిన భార్య అనారోగ్యంతో తనువు చాలించింది. అనూహ్యంగా ఒంటరి వాడైన దర్జీ పల్లెలో తన వృత్తికి ఆదరణ కరవై పూటగడవని స్థితిలో కూలీగా ఒంటరి జీవనం గడుపుతున్నాడు. అప్పటి వరకు ఉంటున్న పూరిల్లూ చెదలు పట్టి కూలిపోవడంతో మళ్లీ ఇల్లు నిర్మించుకునే స్థోమత లేక మూడేళ్లుగా అదే స్థలంలోని స్నానాల గదిలోనే నివాసం ఉంటున్నారు.



★ మఠంపల్లి మండలం బక్కమంతులగూడేనికి చెందిన షేక్ మస్తాన్, మస్తాన్‌బీ దంపతులకు ఇద్దరు సంతానం. వ్యవసాయ భూమి లేదు. దుస్తులు కుట్టి కుటుంబాన్ని పోషిస్తున్న మస్తాన్ భార్య 2019లో అనారోగ్యానికి గురై మృతి చెందింది. కుమారులు ఇద్దరూ బతుకు తెరువు కోసం ఇళ్లు విడిచి వెళ్లారు. దొరికిన పని చేసుకుంటూ మరుగు దొడ్డి పక్కనే ఉన్న స్నానాల గదిలోనే వండుకుని తినడంతో పాటు అక్కడే పడుకుంటున్నట్లు మస్తాన్ చెప్పారు. సరిగ్గా పడుకునేందుకూ సరిపోని స్నానాల గదే తనకు నివాసమైందని చెబుతున్నారు. దుర్భర పరిస్థితిలో ఉన్న తనకు ఇల్లు మంజూరు చేయాలని ప్రాధేయపడుతున్నారు.

– మఠంపల్లి, న్యూస్‌టుడే



నిన్ను నువ్వు పరీక్షించుకో..!

నవంబరు 7న
పాఠశాల స్థాయి
చెకుముకి సంబరాలు

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి వారిని మరింత ప్రోత్సహించేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రతిఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించడమే కాకుండా వారిని చైతన్య పరిచే విధంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. పాఠశాల స్థాయి మొదలుకుని మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులకు ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలో సుమారు 3,836 పాఠశాలలుండగా 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు సుమారు 92 వేల మంది విద్యార్థులకు పైనే ఉన్నట్లుగా తెలుస్తోంది.

– రాజపేట, భువనగిరి, న్యూస్‌టుడే

పాఠశాల మొదలుకుని రాష్ట్రస్థాయి వరకు..

విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభా పరీక్ష నిర్వహిస్తారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు డిసెంబరు మాసంలో ఎంపిక చేసిన ప్రాంతంలో 14-16 వరకు నిర్వహించనున్నారు.

★ 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై ఈ పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపనున్నారు.

ప్రణాళికతో ముందుకు..



రాజపేటలోని ఓ పాఠశాల ఆవరణలో శాస్త్రీయ అంశాలను శ్రద్ధగా వింటున్న విద్యార్థులు (పాతచిత్రం)

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నట్లుగా నిర్వాహకులు అంటున్నారు. ముఖ్యంగా అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని సూచిస్తున్నట్లుగా వివరిస్తున్నారు.



విద్యార్థులకు మంచి అవకాశం: కొంతం శ్రీనివాస్, జనవిజ్ఞాన వేదిక, జిల్లా ప్రధానకార్యదర్శి, యాదాద్రి భువనగిరి

సమగ్రశిక్ష, జేవీవీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి సంబరాల్లో భాగంగా విద్యార్థులకు నిర్వహించే వివిధ రకాల పోటీలు వారికి ఎంతగానో ఉపయుక్తంగా ఉంటాయి. ముఖ్యంగా సైన్స్‌పట్ల మరింత అవగాహన పెంచుకోవడానికి అవకాశం ఉంటుంది. వారి భవిష్యత్తు దృష్ట్యా ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు చొరవ చూపితే ప్రయోజనకరం.

మొరాయిస్తున్న ట్యాబ్‌లు

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

లక్ష్యం సమున్నతమే.. కానీ ఆచరణలో అగచాట్లు తప్పడం లేదు. వ్యవసాయ సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం 2017, 18 సంవత్సరంలో ఏఈవోలకు ట్యాబ్‌లను, సిమ్‌లను అందజేసింది. ప్రస్తుతం ఆ ట్యాబ్‌లు మొరాయిస్తున్నాయి. ట్యాబ్‌లు పంపిణీ చేసి ఆరేళ్లు కావొస్తుండటంతో సమస్యలు తలెత్తుతున్నాయి. ప్రధానంగా ఛార్జింగ్ ఉండకపోవడంతో ఏఈవోలు ఇబ్బంది పడుతున్నారు. పంటల నమోదు కోసం క్షేత్రస్థాయి సందర్శనకు పంట పొలాల వద్దకు వెళ్లి వివరాలను నమోదు చేస్తున్న సమయంలో హ్యాంగ్ కావడం, వివరాలు సగం ఆన్‌లైన్ చేశాక స్విచ్ఛ్‌ఆఫ్ అవ్వడం తలనొప్పిగా మారింది. దీంతో మళ్లీ మొదటి నుంచి పొందుపరచాల్సి వస్తుంది. సాఫ్ట్‌వేర్ సమస్యలకు తోడు కొన్ని ట్యాబ్‌లకు నెట్‌వర్క్ సంకేతాలు కూడా అందడం లేదు. పలు చోట్ల ట్యాబ్‌ల డిస్‌ప్లేలు పగిలిపోయాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదని పలువురు వాపోతున్నారు. తప్పని పరిస్థితుల్లో ఏఈవోలే మరమ్మతులు చేయించుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. పాత ట్యాబ్‌ల స్థానంలో కొత్త వాటిని ఇవ్వాల్సి ఉన్నా వాటిపై ఎలాంటి కదలిక లేదు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఏఈఓలు	
నల్గొండ	140
సూర్యాపేట	98
యాదాద్రి	72

నమోదు చేసే వివరాలు
★ రైతుబంధు ★ రైతుబీమా
★ పంటల నమోదు ★ కోతుల బెడద



ట్యాబ్‌లు మొరాయించడంతో సెల్‌తో డిజిటల్ సర్వే చేస్తున్న ఏఈవో

చరవాణిల ద్వారా ఆన్‌లైన్ చేసుకోవచ్చు.

పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి, నల్గొండ

ట్యాబ్‌లు ప్రస్తుతం అక్కడక్కడ మొరాయిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. పరికరాలు మొరాయిస్తే చరవాణిల ద్వారా యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకుని వివరాలను అన్‌లైన్ చేసుకోవాల్సి ఉంటుంది. ట్యాబ్‌ల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాను.



ఆయుధం.. వాడే విధం..!

మీ కోసం

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

ఒకప్పుడు పోలీసులు తుపాకులు పట్టుకుని తిరుగుతుంటే ప్రతి ఒక్కరు హడలెత్తిపోయే వారు. మారిన పరిస్థితులను బట్టి పోలీసులు ఆయుధాల వాడకం చాలా వరకు తగ్గింది. ప్రస్తుతం వివిధ స్థాయిలో వాడుతున్న ఆయుధాల గురించి నేటి తరం వారికి అంతగా తెలియదు. దీంతో పోలీసుల పనితీరు, ఆయుధాల గురించి తెలిపేందుకు పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా ఓపెన్ హౌస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పోలీసులు ప్రస్తుతం వాడుతున్న ఆయుధాలపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం..

పిస్టల్, రివాల్వర్

విధి నిర్వహణలో స్వీయ రక్షణ కోసం చిన్న ఆయుధాలు వాడుతారు. వీటిలో పిస్టల్, రివాల్వర్లుంటాయి. పిస్టల్‌లో 13 బుల్లెట్లు ఉండగా.. పది మాత్రమే లోడ్ చేస్తారు.. రివాల్వర్‌లో ఆరు బుల్లెట్లు ఉంటాయి. ప్రస్తుతం అందరూ పిస్టల్‌లే వాడుతుండగా.. వీటిలో సాధారణ పిస్టల్, బ్లాక్ పిస్టల్ అని రెండు రకాలుంటాయి. సాధారణ పిస్టల్ ఇనుముతో కూడి ఉండగా.. ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన బ్లాక్ పిస్టల్ తేలికైన పదార్థంతో తయారు చేసి ఉంటుంది.

ఎస్ఎల్ఆర్..

ఇవి పొడవుగా ఉండి వివిధ నాయకులు, అధికారులకు రక్షణగా ఉండే గార్డులు ఈ ఎస్ఎల్ఆర్ తుపాకులు వాడుతారు. ఇవి సెల్ఫ్ లోడింగ్ రైఫిల్స్. వీటిలో 20 బుల్లెట్లు ఉంటాయి. అడవుల్లో కూంబింగ్ చేసే సందర్భాల్లో సైతం వీటిని వాడుతారు.

కార్బన్..

వ్యక్తిగత సహాయకులు కార్బన్ ఆయుధాలు వాడుతారు. ఇవి అడుగు పొడవులో ఉండి.. ప్రజా ప్రతినిధులు, అధికారుల వెంట ఉండే రక్షణ సిబ్బంది చేతుల్లో ఎక్కువగా చూస్తూ ఉంటాం. వీటిని సెమీ ఆటో మెటిక్ వెపన్స్ అంటారు. వీటిలో 32 బుల్లెట్లు ఉంటాయి.

ఏకే 47..

జెడ్ కేటగిరీ భద్రత కలిగి ఉన్న నాయకులు, అధికారుల వ్యక్తిగత రక్షణ సిబ్బంది ఏకే 47 తుపాకులు వాడుతారు. అడవుల్లో కూంబింగ్ సమయంలో సైతం వీటిని వాడుతుంటారు. ఇది ఆటోమెటిక్ వెపన్. దీనిలో కూడా 30 బుల్లెట్లు ఉంటాయి.

303 తుపాకులు

రక్షణ సిబ్బంది, కూంబింగ్ చేసే సందర్భాల్లో పొడవుగా ఉండే 303 తుపాకులు సైతం వాడుతారు. వ్యక్తిగత సహాయకులు సైతం దీనిని ఉపయోగిస్తారు. ప్రస్తుతం వీటి స్థానంలో ఎస్ఎల్ఆర్‌లు వాడుతున్నారు.



మిర్యాలగూడలో పిస్టల్ పని తీరు గురించి విద్యార్థులకు వివరిస్తున్న రెండో పట్టణ సీఐ నాగార్జున, ఎస్సై రాంబాబు

★ పోలీస్ శాఖలోని అన్ని స్థాయిల సిబ్బంది ఈ ఆయుధాలు అన్నింటి వాడకంపై అవగాహన కలిగి ఉంటారు.

పసుపు పచ్చగా... ప్రకృతి మెచ్చగా..!



కనుచూపు మేర చిలకపచ్చరంగులో వరి పైరు అందమిది.. నగర శివారు యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం రుద్రారం, జూలూరు గ్రామాల మధ్య మూసీ పరివాహకంలో వేలాది ఎకరాల్లో వరి పంట సాగు చేస్తున్నారు. కోత సమయంలో వరిపైరు ఇలా కొంత ముదురు గోధుమ, కొంత ఆకు పచ్చరంగులో కనిపిస్తూ ఆకట్టుకుంటోంది.

– ఈనాడు, నల్గొండ

27న పదివేల మందితో మూసీ పునరుజ్జీవ సభ: ఎమ్మెల్యే సామేల్

మోత్కూరు, అడ్డగూడూరు, న్యూస్‌టుడే: ఒకప్పుడు పవిత్రమైన నీరు పారే మూసీనది నేడు కాలుష్యంతో నిండిపోయిందని, అందుకే ఈ నది ప్రక్షాళనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పూనుకున్నారని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ముఖ్యమంత్రి తలపెట్టిన ఈ మహాకార్యానికి నదీ పరివాహక ప్రాంత ప్రజలు, రైతులు మద్దతు తెలిపేందుకు ఈ నెల 27న పది వేల మందితో అడ్డగూడూరు మండలం మానాయికుంట వద్ద గల వంతెన వద్ద మూసీ పునరుజ్జీవ సభ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ శుక్రవారం మానాయికుంట వంతెనపైన మోత్కూరు, అడ్డగూడూరు, శాలిగౌరారం మండలాల ముఖ్య నాయకులతో సభాస్థలిని పరిశీలించి, విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వికారాబాద్ కొండల్లో పుట్టి నల్గొండ జిల్లా వాడపల్లి వద్ద కృష్ణానదిలో కలిసే మూసీ నది హైదరాబాద్ మహానగరం మీదుగా సాగుతుందని, దీనిపై ఎన్నో అనుబంధ కాల్వలు నిర్మించి సాగు, తాగునీరు అందిస్తున్నారని చెప్పారు. కలుషితమైన ఈ నీటిని గత ప్రభుత్వం రూ.25 వేల కోట్లతో శుద్ధి చేసేందుకు ఓ కమిటీని కూడా వేసిందని చెప్పారు. ఆ కమిటీ జాడ లేదని, ఎందుకు ఆ పనులు ప్రారంభించ లేదో అప్పటి మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు చెప్పాలని డిమాండ్ చేశారు. డీపీఆర్ లేదని, పదేళ్లు పాలించి ఎంత దోచుకున్నారో, ఎంత దాచుకున్నారో ప్రజలకు తెలుసని విమర్శించారు. మూసీకి పునరుజ్జీవం కల్పించేందుకు ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి మద్దతు తెలుపుతూ, మూసీ నదిని కాపాడుకునేందుకు ఈ ప్రాంత రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ముఖ్య నాయకులు వంగాల సత్యనారాయణ, లింగయ్య, అన్నెబోయిన సుధాకర్, నిరంజన్‌రెడ్డి, చామల అనిల్‌రెడ్డి, పైళ్ల సోమిరెడ్డి, బాలరాజు, వేణుగోపాల్‌రెడ్డి, జోజి, సత్యనారాయణ, రవి, తదితరులు పాల్గొన్నారు.



మానాయికుంట వంతెన సమీపంలో సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్, తదితరులు

సాగర్ నుంచి 12గేట్ల ద్వారా నీటి విడుదల

నాగార్జునసాగర్, న్యూస్‌టుడే: సాగర్ జలాశయానికి వరదనీటి రాక తగ్గటంతో 12 గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేశారు. శుక్రవారం సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం ప్రకారం.. శ్రీశైలం నుంచి 1,45,136 క్యూసెక్కుల వరదనీరు వస్తుండడంతో ఎన్నెస్పీ అధికారులు 12 గేట్లను 5 అడుగుల మేరకు ఎత్తి 96,324 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. గేట్లతోపాటు కుడి, ఎడమకాల్వ, ప్రధాన విద్యుత్కేంద్రం, ఎస్ఎల్బీసీ, వరదకాల్వ ద్వారా మొత్తం 1,45,136 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా ప్రస్తుతం జలాశయ నీటిమట్టం 589.30 అడుగుల వద్ద ఉంది.

పంచారామ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

దేవరకొండ, న్యూస్‌టుడే: కార్తికమాసాన్ని పురస్కరించుకొని దేవరకొండ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో ఏపీలోని పంచారామక్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తల్లాడ రమేష్‌బాబు శుక్రవారం స్థానికంగా తెలిపారు. ★ అమరావతిలోని అమరలింగేశ్వరస్వామి, భీమవరంలోని సోమేశ్వరస్వామి, పాలకొల్లులోని క్షీరలింగేశ్వరస్వామి, ద్రాక్షారామంలో భీమేశ్వరస్వామి, సామర్లకోటలోని భీమలింగేశ్వరస్వామి క్షేత్రాలకు నవంబరు 03, 10, 17, 24 తేదీల్లో ప్రతి ఆదివారం రాత్రి 8 గంటలకు దేవరకొండ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. ఒకేరోజు పంచారామ క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు, దీంతోపాటు కార్తీక పౌర్ణమి సందర్భంగా నవంబరు 13న తమిళనాడులోని అరుణాచలగిరి సందర్శనకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. పంచారామ క్షేత్రాలకు డీలక్స్ బస్ చార్జీలు.. పెద్దలకు రూ.2వేలు, పిల్లలకు రూ.1200 ఉంటుందన్నారు.

అధిక సాంద్రత విధానంతో.. లాభాల సంపత్తి



అధిక సాంద్రత పత్తి పంట ప్రదర్శన క్షేత్రం

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

పత్తి సాగులో ఆశించిన దిగుబడులు రావడం లేదు. పైగా కూలీల కొరత ఉంటుంది. ఒకేసారి దిగుబడి, అది కూడా ఎక్కువ మొత్తంలో వచ్చేలా అధిక సాంద్రత విధానంలో పత్తి పంటను సాగు చేసేందుకు రైతుల పంట పొలాల్లో ప్రయోగ క్షేత్రాలు నిర్వహించారు. జాతీయ పత్తి పరిశోధన సంస్థ, విత్తన కంపెనీల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో 1500 ఎకరాల్లో సాగు చేశారు. రైతుకు ఒకేసారి కాత, పూత, కోత వస్తే ఎలాంటి సమస్య ఉండదు. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసిన రైతుకు జాతీయ పత్తి పరిశోధన సంస్థ ఎకరాకు రూ.5వేలు ప్రోత్సాహం ఇస్తుంది. ప్రస్తుత సాగు చేస్తున్న సాధారణ పద్ధతులకు భిన్నంగా మూడు విధానాల్లో రైతుల పంట పొలాల్లో సాగు చేయించి, శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పరిశోధనలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో అధిక సాంద్రత పత్తి సాగు (ఎకరాల్లో)

నల్గొండ	సూర్యాపేట	యాదాద్రి
600	500	400

60 లక్షల ఎకరాల్లో..

రాష్ట్రంలో 60 లక్షల ఎకరాల్లో (18 శాతం) పత్తి సాగులో ఉంది. ఏటా పెట్టుబడులు పెరగడం, తెగుళ్ల బెడద, కూలీల కొరతను అధిగమించేందుకు జాతీయ పత్తి పరిశోధన సంస్థ నూతన విధానంలో పత్తి సాగుకు మొగ్గు చూపింది. గతేడాది ప్రయోగాత్మకంగా సాగు చేసిన ప్రాంతాల్లో సత్ఫలితాలు రావడంతో ఈ సీజన్‌లో శాస్త్రవేత్తల పర్యవేక్షణలో డాట్ సెంటర్లు, కృషి విజ్ఞాన కేంద్రాలతో పాటు ఆసక్తి గల రైతులను ఎంపిక చేసి ప్రయోగ క్షేత్రాలను ఏర్పాటు చేశారు.

దిగుబడి

ఈ విధానంలో పత్తి దిగుబడి 12-14 క్వింటాళ్లు వస్తుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. సీజన్‌లో ఇప్పటికే కొందరికి ఎకరానికి 12 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు వివరించారు.

ఒకేసారి ఏరడం..

సాధారణానికి భిన్నంగా మొక్కల సంఖ్యను పెంచి సాగు చేస్తే దిగుబడి ఎక్కువగా వచ్చే వీలుంది. దీనికి రెండు పద్ధతులను పాటించి ప్రయోగక్షేత్రాలను నిర్వహిస్తున్నారు. అధిక సాంద్రత విధానంలో వరసల మధ్య 90 సెం.మీ., మొక్కల మధ్య 30 సెం.మీ.లు ఉండేలా విత్తనం నాటారు. సంప్రదాయ పద్ధతిలో ఎకరానికి 10 వేల మొక్కలు ఉంటే అధిక సాంద్రత విధానంలో 29,629 మొక్కలు వస్తాయి. సాధారణ పత్తి సాగులో 180 రోజులుంటే విడతల వారీగా అయిదు సార్లు పత్తి ఏరాల్సి ఉంటుంది. అధిక సాంద్రత విధానంలో అయితే 150 రోజుల్లో పంట చేతికి వస్తుంది. పైగా ఒకేసారి ఏరడం పూర్తవుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు

రైతులకు ప్రోత్సాహం

– డాక్టరు అనిల్‌కుమార్ సీనియర్ శాస్త్రవేత్త, ఏరువాక కేంద్రం యాదాద్రి



సాధారణ విధానంలో పత్తి సాగు యాంత్రీకరణకు అనుకూలంగా ఉండదు. నూతన విధానంలో సాగు లాభదాయకం. అధిక సాంద్రత విధానంలో పత్తి సాగు చేసేందుకు ముందుకు వచ్చే రైతులతో క్లస్టర్ ఏర్పాటు చేసి ఎంపిక చేసిన వారికి రూ.5 వేలు ప్రోత్సాహం అందిస్తున్నాం. గతేడాది, ఇప్పుడు రైతులకు ఎకరాకు 12-14 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వస్తుంది. భవిష్యత్తులో సాగు విస్తీర్ణం పెంచాలని జాతీయ పత్తి పరిశోధన సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది.



భళా.. వనమాల

జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ విజేతగా శశాంక్

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: తమిళనాడు రాజధాని చెన్నైలో శుక్రవారం జరిగిన అండర్-15 సింగిల్స్ బ్యాడ్మింటన్ ఫైనల్ పోటీల్లో నల్గొండ జిల్లా మిర్యాలగూడకు చెందిన వనమాల శశాంక్ విజేతగా నిలిచాడు. హైదరాబాద్‌లోని గోపీచంద్ అకాడమీలో శిక్షణ పొందుతూ.. రాష్ట్రం తరఫున టోర్నీలో పాల్గొన్న శశాంక్.. అండమాన్ నికోబార్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ క్రీడాకారులపై విజయం సాధించి.. ఫైనల్స్‌లో ప్రవేశించాడు. ఫైనల్స్‌లో కర్ణాటక క్రీడాకారుడు పుష్కర్ సాయిపై 21-9, 15-21, 21-17 తేడాతో విజయం సాధించి జాతీయ ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా మిర్యాలగూడకు చెందిన బ్యాడ్మింటన్ జిల్లా శిక్షకుడు మారబోయిన రామకృష్ణ, బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ప్రశాంత్, నవీన్‌కుమార్, శ్రీకాంత్‌తో పాటు పలువురు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	115–00
రిటైల్	137–00
డ్రెస్డ్	199–00
స్కిన్‌లెస్	226–00

సామాజికసేవలో భాగస్వాములు కావాలి: కలెక్టర్



విద్యార్థులకు బూట్లు అందజేస్తున్న కలెక్టర్ హనుమంత్ కె.జెండగే

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: యువత సామాజిక సేవలో భాగస్వాములు కావాలని కలెక్టర్ హనుమంత్ కె.జెండగే అన్నారు. నవ భారత్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన బూట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుందన్నారు. రాజపేటలో ఇటీవల ప్రైవేటు పాఠశాల నుంచి ప్రభుత్వ పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు చేరడం సంతోషాన్ని కలిగించిందన్నారు. నవ భారత్ అసోసియేషన్ అధ్యక్షుడు సరగడ కరుణ్, డీఆర్‌డీవో నాగిరెడ్డి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ధనంజేయులు, వార్డు కౌన్సిలర్ లక్ష్మి, ఎంఈవో నాగవర్ధన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు భాస్కర్ పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ.. చిటికెలో పనిపూర్తి



పురుగుమందు పిచికారీకి డ్రోన్‌ను సిద్ధం చేస్తున్న ఆపరేటర్



రాగిబావిలో పత్తిచేలో పురుగు మందు పిచికారీ

మోత్కూరు, న్యూస్‌టుడే: వ్యవసాయంలో సాంకేతిక యంత్రాలు ఒక్కొక్కటిగా వచ్చి చేరుతున్నాయి. ఒకనాడు ట్రాక్టర్లు, ఫ్లౌవ్‌లు, వరినాటు యంత్రాలు, కోత మిషన్లు ఇలా.. అనేకం వచ్చి చేరాయి. రైతుకు యంత్రాలతో శ్రమ తగ్గుతుంది. అలాగే ఖర్చు కూడా తగ్గుతూ వస్తుంది. పురుగు మందు పిచికారీ చేసేందుకు.. అప్పట్లో చేత్తో పంపులోకి గాలికొట్టి చేతిపంపుల ద్వారా చేసేవారు. థైవాన్ స్ప్రెయర్లు అందుబాటులోకి రాగా పెట్రోల్, డీజిల్‌తో గాలికొట్టే పనిలేకుండా పిచికారీ చేశారు. నేడు డ్రోన్లతో అతితక్కువ సమయంలో ఎకరాలకు ఎకరాలు తక్కువ ఖర్చుతో పిచికారీ చేసే అవకాశం అందుబాటులోకి వచ్చింది. ఇప్పుడిప్పుడే ఇవి గ్రామాలకు చేరుతున్నాయి.

– మోత్కూరు మండలంలో డ్రోన్ల ద్వారా పిచికారి చేస్తున్నారు. స్థానికంగా ఉన్న మన గ్రోమోర్ దుకాణాల వారికి కోరామండల్ కంపెనీ వారు డ్రోన్లను అందుబాటులో ఉంచారు. కావాల్సిన రైతులు మన గ్రోమోర్ కేంద్రాల ద్వారా వాటిని తీసుకెళ్లి పిచికారీ చేయించుకుంటున్నారు. కేవలం 10 నిమిషాల్లో ఎకరం పత్తిచేను పిచికారీ చేసేస్తున్నారు. పది లీటర్ల పురుగు మందు, నీళ్లు కలిపిన ద్రావణాన్ని డ్రోన్ మోసుకొని పోయి క్షణాల్లో పొలం చుట్టూ తిరిగి ఎకరం పొలానికి పిచికారీ చేస్తుంది. ఎకరానికి రూ.400 చొప్పున తీసుకుంటున్నారని రాగిబావి రైతు సత్తిరెడ్డి 'న్యూస్‌టుడే'కు తెలిపారు. గతంలో ఎంతో సమయం పట్టేదని, ఇప్పుడు క్షణాల్లో పనిపూర్తవుతుందని ఆయన తెలిపారు. ఖర్చూ తగ్గిందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80082 78928 80085 74375

రహదారికి మరమ్మతులు

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట పాత బస్టాండ్ వద్ద ఐటీఐల పైప్‌లైను కోసం తవ్విన గుంతతో రహదారి గుంతలుగా మారింది. ఈ నెల 18న 'ఈనాడు'లో మేమున్నాం.. మీకు తోడుగా శీర్షికన సమస్య ప్రచురితమైంది. స్పందించిన అధికారులు శుక్రవారం రహదారి మరమ్మతులు చేపట్టారు.

స్పందనకు వందనం

అవీ ఇవీ

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం.. భువనగిరి పట్టణం: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పైళ్ల గణపతిరెడ్డి ఆరోపించారు. పట్టణంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో చేపట్టిన సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలు నేటికీ నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో మహిళా విభాగం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా అనిత, సభ్యులుగా బుజ్జమ్మ, మల్లమ్మ ఎన్నికయ్యారు.

ఐద్వా రాష్ట్ర కమిటీలో చోటు.. భువనగిరి గంజ్: ఐద్వా రాష్ట్ర కమిటీలో జిల్లా వాసులకు చోటు లభించింది. భద్రాద్రి కొత్తగూడెంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఐద్వా రాష్ట్ర మహాసభల్లో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఉన్న బట్టుపల్లి అనురాధ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అవ్వారు రామేశ్వరి, కల్లూరి నాగమణి రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

రాజపేటకు సాగునీరు అందించాలి.. రాజపేట: కాళేశ్వరం 15వ ప్యాకేజీ కాలువ ద్వారా రాజపేట మండలానికి సాగునీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరుతూ శుక్రవారం భారాస నాయకుల బృందం జగదేవ్‌పూర్ నీటిపారుదల ఈఈకి వినతిపత్రం అందించారు. మండల అధ్యక్షుడు సట్టు తిరుమలేశ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు చామకూర గోపాల్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి సేవలో మంత్రి కోమటిరెడ్డి సతీమణి.. యాదగిరిగుట్ట: యాదాద్రి పుణ్యక్షేత్రాన్ని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సతీమణి సబితారెడ్డి శుక్రవారం సాయంత్రం సందర్శించారు. శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పండితులు, పూజారులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఈవో భాస్కర్‌రావు ప్రసాదాలు అందజేశారు.

సదర్ సమ్మేళనం విజయవంతం చేయండి.. వలిగొండ: యాదవ సామాజిక వర్గం హక్కుల సాధనకు పోరాటం చేయడానికి సిద్ధం కావాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల యాదమల్లయ్యయాదవ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 27న ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే యాదవ సదర్ సమ్మేళనం జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

యుద్ధభేరి.. భూదాన్‌పోచంపల్లి: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఈ నెల 29న చేపట్టే మాదిగ యుద్ధభేరిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు దుబ్బ రామకృష్ణ తెలిపారు. మండల పరిధిలోని సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎంపిక.. సంస్థాన్‌నారాయణపురం: మండల ప్రెస్ క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కొండ శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా ఎస్కే పాషా, ప్రధాన కార్యదర్శిగా కలకొండ సంజీవ, కోశాధికారిగా ఉప్పల వెంకటేశం, సహాయ కార్యదర్శిగా గంగపురం సాయి, గౌరవ సలహాదారులుగా పాలకూర్ల యాదయ్య, గౌరవ అధ్యక్షుడిగా తడకమల్ల శ్రీధర్ ఎన్నికయ్యారు.

సన్మానం... భువనగిరి పట్టణం: మార్కెట్ కమిటీ అధ్యక్షురాలిగా నియమితులైన కానుకుంట్ల రేఖ, కార్యవర్గ సభ్యులను శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు చిక్కుల వెంకటేశం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి నుచ్చు నాగయ్య, నాయకులు తోటకూరి వెంకటేష్‌యాదవ్, భిక్షపతి, చుక్క స్వామి, ఎడ్ల శ్రీనివాస్, బొల్లేపల్లి అశోక్, వెంకటేశం, ఆంజనేయులు, కొండల్, సురేష్, రవి, ఏడుమేకల మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక.. భువనగిరి పట్టణం: జిల్లా ఎస్‌జీఎఫ్ గేమ్స్ కమిటీని శుక్రవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఎన్నుకున్నారు. ఛైర్మన్‌గా గంగాధర్, అధ్యక్షుడిగా రమణి, ఉపాధ్యక్షుడిగా పాపిరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ప్రసాద్, కన్వీనర్‌గా ధనుంజయ్, మరో ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు.

హామీల అమల్లో ప్రభుత్వం విఫలం.. ఆలేరు: ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రుణమాఫీ, రైతు భరోసా, వరికి బోనస్, ఉచిత విత్తనాలు, ఎరువుల పంపిణీ వంటి హామీలను అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చెక్క వెంకటేశ్ అన్నారు. రైతుల సమలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహసీల్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. నాయకులు జి.స్వామి, జి.కృష్ణయ్య, జి.స్వామి, బి.ఆంజనేయులు, లక్ష్మి, ఎల్లయ్య, కె.ఉప్పలయ్య, నిర్మల, శ్యామల, మల్లయ్య పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు.. మోత్కూరు: ప్రభుత్వం మోత్కూరులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొనసాగించాలని కోరుతూ శుక్రవారం మండల భాజపా నాయకులు స్థానిక సబ్‌రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. మోత్కూరు పాత తాలూకా పరిధిలో 47 గ్రామపంచాయతీలు 40 ఏళ్లుగా ఈ కార్యాలయంతో రిజిస్ట్రేషన్ల సౌకర్యం పొందుతున్నాయని నాయకులు తెలిపారు. ఆదాయం తగ్గిందని సొంత భవనం గల ఈ కార్యాలయాన్ని రద్దు చేయడం సరికాదన్నారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం.. యాదగిరిగుట్ట అర్బన్: ధాన్యాన్ని దళారులకు విక్రయించి రైతులు నష్టపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి అధిక ధర పొందాలని ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ ఐనాల చైతన్య రెడ్డి రైతులకు సూచించారు. శుక్రవారం యాదగిరిగుట్ట మండలం మాసాయిపేట గ్రామంలో పీఏసీఎస్ ఛైర్మన్ ఇమ్మడి రాంరెడ్డితో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు.

క్రషర్లను నిలిపి వేయాలి.. బొమ్మలరామారం: బొమ్మలరామారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న స్టోన్ క్రషర్లను వెంటనే నిలిపి వేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు దాసరి పాండు ఆధ్వర్యంలో శుక్రవాం తహసీల్దార్ శ్రీనివాస్‌రావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమలో సీపీఐ మండల కార్యదర్శి అన్నెమైన వెంకటేశం, ఆనందం, మౌనిక, జ్యోతి, జయమ్మ, లావణ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలని సింగిల్‌విండో ఛైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి తెలిపారు. ఎస్.లింగోటం గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వరంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైస్ ఛైర్మన్ చెన్నగోని అంజయ్యగౌడ్, మండల వ్యవసాయాధికారి ముత్యాల నాగరాజు, సింగిల్‌విండో డైరెక్టర్లు నర్సిరెడ్డి, వెంకటేశం, కృష్ణ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ



విద్యార్థినులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

మోటకొండూరు, న్యూస్‌టుడే: విద్యార్థినులకు ఉత్తమ విద్య, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలని జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపులే బీసీ బాలికల గురుకుల పాఠశాలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. భోజనం, పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, డైనింగ్‌హాల్, పాఠశాలలో దస్త్రాలను పరిశీలించారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజన వసతి సదుపాయాలు, విద్యా, బోధన, మెనూ తదితర విషయాలను ప్రిన్సిపల్ జ్యోతిని అడిగి తెలుసుకున్నారు. వంటగదిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. పాఠశాలలో అందిస్తున్న వసతులపై విద్యార్థిలను అడిగి తెలుసుకున్నారు. జిల్లా వెనకబడిన తరగతుల అధికారి యాదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

అన్ని పార్టీలకు చోటు కల్పించాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: గ్రామాల్లో, పురపాపలిక వార్డుల్లో ఇందిరమ్మ కమిటీల్లో అన్ని రాజకీయ పార్టీలకు చోటు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. భువనగిరి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల సమితి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకపక్షంగా కాంగ్రెస్ కార్యకర్తలతో కమిటీలు నియమించడం వల్ల లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు జరిగే అవకాశం ఉంటుందని కమిటీ జాబితాలో అందరికి ప్రాతినిధ్యం ఉండాలని డిమాండ్ చేశారు. కమిటీ నియామకంలో రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏశాల అశోక్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షులు సోమన సబిత, మండల కార్యదర్శి మరిపెల్లి రాములు, పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అభిలాష్ పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన

భువనగిరి పట్టణం: అప్రమత్తంగా వ్యవహరిస్తేనే వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని స్కిడ్ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ భానుకుమార్ అన్నారు. పట్టణంలోని గౌతమ్ మాడల్ స్కూల్‌లో శుక్రవారం హెచ్ఐవీపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సందీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థి..!

సంస్థాన్‌నారాయణపురం, న్యూస్‌టుడే: సర్వేల్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి శుక్రవారం గోడ దూకి పారిపోయాడు. మధ్యాహ్నం విద్యార్థుల హాజరు తీసుకునేటప్పుడు విద్యార్థి తప్పిపోయిన విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తించారు. వెంటనే తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. సాయంత్రం వరకు ఇటు తల్లిదండ్రులు అటు ఉపాధ్యాయులు ఆందోళన చెందారు. విద్యార్థిది సర్వేల్ గ్రామం పక్కనే ఎర్రగుంట కావడంతో తమ వ్యవసాయ బావి వద్ద వెళ్లి దాక్కున్నాడు. రాత్రి అవడంతో భయపడి విద్యార్థి ఇంటికి చేరుకున్నాడు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. గతంలో కూడా విద్యార్థి ఇలాగే చేయడంతో తల్లిదండ్రులు మందలించి తిరిగి గురుకులానికి పంపించారు.

చోరీకి వచ్చిన పాత దొంగ అరెస్ట్

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల్లో చోరీలు చేస్తున్న దొంగ చౌటుప్పల్ పోలీసులకు అనుమానాస్పదంగా శుక్రవారం చిక్కాడు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా పలు దొంగతనాలు చేసినట్టు పోలీసులకు వెల్లడించాడు. ఏపీ, తెలంగాణలో కలిపి అతనిపై మొత్తం 15 కేసులు ఉన్నట్టు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలురుపాడులోని ఎస్సీ కాలనీకి చెందిన కారం నరేష్(35) గత కొంత కాలం నుంచి చోరీలు చేస్తున్నాడు. తాళం వేసిన ఇళ్లలో, ద్విచక్రవాహనాలు అపహరిస్తుంటాడు. నరేష్‌పై చౌటుప్పల్‌లో 6, నారాయణపురంలో 1, చివ్వెంలలో 3, సూర్యాపేట రూరల్ 1, రాగునాడపల్లిలో 1, చించిగూడెంలో 1, విజయవాడ సీటీలో 1, రామయ్యపురం పోలీస్‌స్టేషన్లలో 1 కేసు ఉన్నట్టు ఒప్పుకున్నాడు. నరేష్ మరోసారి చౌటుప్పల్‌లో చోరీ చేసేందుకు వచ్చి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతు పోలీసులకు పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకోని వేలిముద్రలను పరిశీలించగా పాత కేసులు బయటపడ్డాయి. గతంలో తాను చేసిన చోరీల వివరాలను పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. నిందితుడిని చౌటుప్పల్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

దోషం పేరు చెప్పి.. నగదుతో ఉడాయించి

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: మీ కుటుంబానికి దోషం ఉందని పరిహారం చేస్తే ముప్పు తొలగిపోతుందని చెప్పి నగదుతో ఉడాయించిన ఘటన ఆత్మకూరు(ఎం) మండలం సింగారం పంచాయతీ పరిధిలోని శేరిబావి వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వాకిటి మల్లారెడ్డి ఇంటికి బాబావేషంలో గుర్తుతెలియని వ్యక్తి వచ్చి మీ కుటుంబానికి దోషం పట్టిందని పరిహారం చేయకుంటే బైక్‌పై తిరిగే మీ కుమారుడికి ప్రమాదం జరుగుతుందని, పరిహారం కోసం వరుసగా మూడు అమావాస్య రోజుల్లో పూజలు చేయాలని రూ.20 వేలు ఖర్చవుతుందని చెప్పగా డబ్బులు లేవని బాధితుడు తిరస్కరించాడు. కనీసం దిష్టి బొమ్మ పెట్టుకుంటే దోషం కొద్దిగా తగ్గుతుందని నమ్మించాడు. నీ వద్ద ఉన్నంత ఇచ్చి మూడు రకాల ధాన్యాలు, నిమ్మకాయలు, ప్లేటు, డబ్బా తీసుకునిరా అనడంతో అలాగే చేశాడు. పూజ చేసి తాయత్తులు ఇచ్చి నుదుట విభూతి పెట్టాడు. అనంతరం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసి రూ.మూడు వేలకు తగ్గాడు. బాధితుడు ఇటీవల ధాన్యంగా అమ్మగా వచ్చిన నగదు రూ.39 వేలు ఇంట్లో దాచాడు. మత్తులో బాధితుడు రూ.39 వేల కట్టను బాబాకు ఇవ్వడంతో నగదు లెక్కపెట్టకుండానే ఉడాయించాడు. తేరుకున్న బాధితుడు చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆత్మకూరు పోలీసులకు ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు సీఐ పి.సోలోమన్‌రాజు తెలిపారు.

గుట్టలో లాడ్జి సీజ్

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోని పాతగుట్ట కాలనీలో యాదాద్రి ఫ్యామిలీ రూమ్స్ పేరుపై ఉన్న లాడ్జిని పోలీసులు, రెవెన్యూ అధికారులు కలిసి శుక్రవారం సీజ్ చేశారు. సెప్టెంబరు 26న లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు వెలుగుచూడగా కేసు నమోదు చేశామని, విచారణ అనంతరం ఆర్డీవో ఆదేశాలతో సీజ్ చేసినట్లుగా సీఐ రమేశ్ తెలిపారు. లాడ్జిల్లో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలుగా మార్చితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

భూ వివాదంపై క్షేత్రస్థాయి పరిశీలన

యాదగిరిగుట్ట పట్టణం, న్యూస్‌టుడే: యాదగిరిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 152 లోని 2-02 ఎకరాల భూమిపై నెలకొన్న వివాదంపై శుక్రవారం ఇన్‌ఛార్జి తహసీల్దారు దేశ్య, ఆర్ఐ విజయ్‌సింహారెడ్డి, సర్వేయర్ దేవాతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కాలనీకి చెందిన పలువురు అక్కడికి చేరడం, వాదోపవాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తంగా మారింది. 1990 తర్వాత ఆ భూమిపై ఎవరున్నారు, అమైన్‌మెంట్ ఎలా జరిగింది పూర్తి వివరాలు సేకరించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సూచించడంతో శాంతించారు.

☛ పట్టణంలోని యాదగిరిపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 152 లోని 2-02 ఎకరాల భూమిని అక్రమంగా మ్యుటేషన్ చేసుకున్నారని కొందరు చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని, కొనుగోలు చేసిన పట్టా భూమి అని ఆ కాలనీకి చెందిన దండు విజయలక్ష్మి, ఆమె కుమారుడు సందీప్‌కుమార్ స్పష్టం చేశారు.

బెల్టు దుకాణంపై కేసు నమోదు

చౌటుప్పల్‌గ్రామీణం, న్యూస్‌టుడే: జైకేసారంలో అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న బెల్టు దుకాణంపై దాడి చేసి కేసు నమోదు చేసినట్టు పోలీస్ ఇన్‌స్పెక్టర్ మన్మథకుమార్ శుక్రవారం తెలిపారు. సుమారు రూ.ఏడు వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొన్నారు. దుకాణం నిర్వాహకురాలు పందుల సుగుణమ్మపై ఏఎస్సై కరుణాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు.

రోడ్డు పనులు త్వరితగతిన పూర్తిచేయాలి



మోత్కూరు పుర సాధారణ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరులో ప్రధాన రహదారి విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం పుర అధ్యక్షురాలు గుర్రం కవిత అధ్యక్షతన మోత్కూరు పుర సాధారణ సమావేశం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుర అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరు చేయించానని చెప్పారు. పురపాలిక పరిధిలో పలుచోట్ల మరుగుదొడ్లు నిర్మించాలని తీర్మానించారు. సమావేశంలో కమిషనర్ సి.శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు బి.వెంకటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

☛ తొలుత మోత్కూరు వ్యవసాయ మార్కెట్లో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో ఛైర్మన్ పి.వెంకటేశ్వర్లు, మార్కెట్ కార్యదర్శి ఉమామహేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పురపాలిక అభివృద్ధికి ప్రణాళిక



ఛైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌన్సిలర్ శ్రీధర్‌బాబు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్ పురపాలిక సమగ్ర అభివృద్ధికి ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఛైర్మన్ వెన్‌రెడ్డి రాజు తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆయన అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో మాట్లాడారు. ఘన, ద్రవ వ్యర్థాలను శుద్ధి చేసే కేంద్రాలను లింగోజీగూడెంలో పురపాలిక నిధులు రూ.70 లక్షలతో ఏర్పాటు చేయాలని తీర్మానించారు. కమిషనర్ కె.నర్సింహారెడ్డి, మేనేజర్ లింగయ్య, పర్యావరణ ఇంజనీర్ రేణుకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బస్వాపురం ప్రాజెక్టు పూర్తికి డిమాండ్



మహాసభలో మాట్లాడుతున్న ఎండీ జహంగీర్

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: బస్వాపురం జలాశయాన్ని వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీటి సమస్య తొలగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. వడపర్తిలో శుక్రవారం నిర్వహించిన మండల 8వ మహాసభలో ఆయన మాట్లాడారు. గుత్తేదారుకు డబ్బులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిచేయలేదని, వెంటనే మిగులు పనులకు రూ.500 కోట్లు కేటాయించి సత్వరమే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, ఈర్లపల్లి ముత్యాలు, లవుడియా రాజు, అన్నంపట్ల కృష్ణ, అశోక్, సిల్వేరు ఎల్లయ్య, అబ్దుల్లాపూర్ వెంకటేశ్, పాండాల మైసయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలి

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు సేవాదళ్ నాయకులు కృషి చేయాలని సేవాదళ్ జిల్లా ఇన్‌ఛార్జి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహంకాళి దాస్ అన్నారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని నవంబరు 20న గాంధీభవన్‌లో నిర్వహించనున్న కార్యక్రమానికి అత్యధిక సంఖ్యలో తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి పిట్టల బాలరాజు, పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్‌కుమార్, నాయకులు స్వాతి, వాజిద్, సామాల రవీందర్, శిరీష, ఉమారాణి, నర్సింహ, రాజేష్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి దివిస్ సహకారం



విజ్ఞానశాస్త్ర ప్రయోగ పరికరాలను ఎంఈవో గురువారావు చేతులమీదుగా అందజేస్తున్న దివిస్ ప్రతినిధులు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రయోగాత్మక బోధనతోనే విద్యార్థుల జ్ఞానం పెరుగుతుందని, ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉంటుందని చౌటుప్పల్ మండల విద్యాధికారి గురువారావు అన్నారు. దివీస్ లేబొరేటరీస్ యాజమాన్యం ఈ మండలంలోని 22 జడ్పీ, మోడల్, గురుకులం, కేజీబీవీలకు మంజూరు చేసిన రూ.39 లక్షల విలువైన విజ్ఞాన శాస్త్ర ప్రయోగశాలల పరికరాలను సరఫరా, మంజూరు పత్రాలను శుక్రవారం ఆయన చేతులమీదుగా పంపిణీ చేసి మాట్లాడారు. దాతల సహకారాన్ని సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలను సాధించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు కర్నె శివకుమార్, భార్గవి, భవాని, సరోజమ్మ, దివీస్ ప్రతినిధులు బి.గోపి, ఎస్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అందని దుప్పట్లు



టార్పాలిన్‌తో ప్రత్యమ్నాయం ఏర్పాటు చేసిన దృశ్యం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ బీసీ సంక్షేమ వసతిగృహంలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన దుప్పట్లు అందకపోవడంతో అవస్థలకు గురవుతున్నారు. ప్రభుత్వం నుంచి దుప్పట్లు వచ్చినా ఇంకా అందజేయలేదు. నూతన భవనం కావడంతో కిటికీలు బాగుండటంతో చలికి తట్టుకోగలుగుతున్నారు. కొన్ని కిటికీలు లేకపోవడంతో ప్రత్యమ్నాయంగా టార్పాలిన్లు ఏర్పాటు చేసుకున్నారు.

నాణ్యమైన విద్య, ఆహారం అందించాలి

ఆత్మకూరు(ఎం), న్యూస్‌టుడే: విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆహారం అందించాలని జడ్పీ సీఈవో ఎన్.శోభారాణి అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బా బాలికల విద్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. బాలికల సామర్థ్యాలను పరీక్షించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో దస్త్రాలను పరిశీలించారు. మండలంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులపై సమీక్షించి, నిలిచి పోయిన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంపీడీవో రాములు నాయక్, కేజీబీవీ సిబ్బంది ఉన్నారు.

నేడు ప్రజా చైతన్య యాత్ర

భువనగిరి పట్టణం: మూసీ పునరుజ్జీవనంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు శనివారం చేపట్టనున్న ప్రజా చైతన్య యాత్రను పార్టీలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలు శుక్రవారం వేర్వేరుగా విడుదల చేసిన ప్రకటనల్లో కోరారు. పిల్లాయిపల్లి నుంచి మక్తఅనంతారం వరకు పాదయాత్రను చేపడుతున్నామని తెలిపారు.

జవాన్ కుటుంబానికి సాయం

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే: విధుల్లో ఉండగా అనారోగ్యంతో మృతిచెందిన భువనగిరి పట్టణానికి చెందిన జవాన్ తంద్ర రవికుమార్ కుటుంబానికి తోటి జవాన్లు ఆర్థికసాయం అందజేశారు. రవి కుమార్ ఇండో టిబెటిన్ బోర్డర్‌లో హవాల్దార్ ఆర్మోరర్‌గా విధులు నిర్వహించేవారు. అనారోగ్యంతో ఈ నెల 21న కన్నుమూశారు. పెద్దకర్మ సందర్భంగా ఫోర్స్ తరపున గాడ్ ఆఫ్ హానర్ తెలిపారు. పారా మిలటరీ తెలుగు జవాన్ల తరపున రూ.71వేలు, ఖమ్మం సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ రూ.పదివేలు, రిటైర్డ్ బ్యాచ్‌మెంట్స్ రూ 31వేలు, టౌన్ ఇన్‌స్పెక్టర్ రూ.2వేల సాయం అందజేశారు.

వరి, పత్తి పంటల పరిశీలన

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని వీరవెల్లి, కూనూరు, మోటకొండూరు మండల కేంద్రలో వివిధ పంటలను సంబంధిత అధికారులు పరిశీలించారు. చీడపీడల నివారణకు మందులను సూచించారు. ఏరువాక శాస్త్రవేత్త అనిల్‌కుమార్, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు శుభమ్, బాలరాజు, మల్లయ్య, వెంకటేశ్, ఎల్లారెడ్డి, యాదయ్య పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ



మాట్లాడుతున్న దిల్‌రెడ్డి

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతారంలోని వాత్సల్య ఇంజినీరింగ్ కళాశాలల బ్రహ్మకుమారీ సమాజం ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, నైతిక విలువలు, ధ్యానంపై రెండు రోజుల శిక్షణ శుక్రవారం ప్రారంభించారు. మౌంట్ అబూకు చెందిన బ్రహ్మకుమారీస్ ప్రతినిధి దిల్‌రెడ్డి మాట్లాడుతూ.. జీవితంలో లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించేందుకు నిరంతర ప్రయత్నం సాగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సీఈవో దరిపల్లి ప్రవీణ్‌కుమార్, బాలేశ్వర్, రామేశ్వర్, వివిధ అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసే వరకు పోరాటం

రామన్నపేట, న్యూస్‌టుడే: రామన్నపేటలో సిమెంటు పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని పర్యావరణ పరిరక్షణ వేదిక, అఖిలపక్ష నాయకులు పేర్కొన్నారు. రామన్నపేటలో శుక్రవారం జరిగిన సమావేశంలో వేదిక మండల కన్వీనర్ జల్లెల పెంటయ్య, కోకన్వీనర్ ఎం.డి. రెహాన్ మాట్లాడారు. ఐక్య ఉద్యమాన్ని దెబ్బతీసే విధంగా భారాస నాయకులు వ్యవహరించవద్దని విజ్ఞప్తి చేశారు. పరిశ్రమ ప్రభావిత ప్రాంతాల ప్రజలే ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్నారన్నారు. భాజపా ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నకిరెకంటి మొగిలయ్య మాట్లాడుతూ ఈఅంశాన్ని కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకువెళ్లి పరిశ్రమ ఏర్పాటును రద్దు చేసేందుకు కృషి చేస్తామన్నారు. నర్సింహ, ప్రభాకర్, ఎం.డి.జమీరొద్దీన్, వెంకటేశం, దుర్గయ్య, నరేందర్, పృథ్వీరాజ్, మీర్జా ఫజల్‌బేగ్, అంజయ్య పాల్గొన్నారు.

ట్రెక్కింగ్, రాక్‌క్లైంబింగ్‌పై శిక్షణ

బీబీనగర్, న్యూస్‌టుడే: హిమాచల్‌ప్రదేశ్‌లోని ధర్మశాలలో జరుగుతున్న జాతీయ సాహస శిబిరంలో బీబీనగర్ తెలంగాణ సాంఘిక సంక్షేమ సైనిక మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కె.స్రవంతి, వాలంటీర్ ప్రతిభ పాల్గొన్నారు. శిక్షణలో శుక్రవారం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు ట్రెక్కింగ్, రాక్‌క్లైంబింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ నెల 31 వరకు ఈ శిక్షణ కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

రాస్తారోకో

మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక పులే చౌరస్తా వద్ద బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన హామీని వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అంజయ్య, నర్సయ్య, నాగయ్య, నరేష్, ప్రతాప్ రెడ్డి, నర్సింహ, మల్లేష్ పాల్గొన్నారు.